

కేంద్ర బడ్జెట్‌లో మరోసారి మొండిచేయి

సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి పాడేరు:కేంద్రం ఎప్పటి మాదిరిగానే 2023-24 బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయి చూపిందని, విభజన హామీలను పూర్తిగా అటకెక్కించిందని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స బుధవారం ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి తన బాధ్యత అని మొసలి కన్నీరు కార్చిన ప్రధాని గత ఎనిమిది సంవత్సరాలుగా ద్రోహం చేస్తూనే వచ్చారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అదానికి బిజెపి తాకట్టు పెట్టిందన్నారు.విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటి వాటి ఊసెత్తలేదని పేర్కొన్నారు.ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లా వంటి వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించ లేదన్నారు.ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కర్ణాటకు కొత్తగా ప్రత్యేక కేటాయింపులు చేసిన కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని నిర్లక్ష్యం చేసిందని, నిర్వాసితులకు మొండిచేయి చూపిందన్నారు. ఉపాధి హామీ కేటాయింపుల్లో సగం కోతపెట్టిందన్నారు. రాష్ట్రానికి తీవ్ర నిరాశ కలిగించిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం వ్యతిరేకించాలన్నారు.

గిరిజన విద్యార్థుల సమస్యలు, రిలే దీక్షల భగ్నంపై..

విద్యా సంస్థల బంద్ విజయవంతం

▶▶ మూతపడిన పాఠశాలలు, కాలేజీలు ▶▶ ఎస్‌ఎఫ్ఐ, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం


ముంచంగిపుట్టులో పిఒ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న నాయకులు

గిరిజన విద్యార్థుల సమస్యలు, రిలే దీక్షల భగ్నంపై పాడేరు ఏజెన్సీలో బుధవారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయ వంతమైంది. పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. పెదబయలులో ర్యాలీ, మానవహారం చేపట్టారు. పీవో దిష్టిబొమ్మను దగ్ధం చేశారు .


ప్రజాశక్తి-పాడేరు: గిరిజన విద్యార్థుల సమస్యలు, వీటి పరిష్కారానికై రిలే దీక్షలు చేపట్టిన ప్రజా సంఘాల వేదిక నాయకుల అరెస్టులను నిరసిస్తూ పిలుపునిచ్చిన బుధవారం నాటి విద్యా సంస్థల బంద్ పాడేరు ఏజెన్సీలో విజయవంతమైంది. పాడేరు పట్టణంలోని ప్రైవేటు విద్యా సంస్థలు బంద్ కారణంగా మూతపడ్డాయి. ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్న కళాశాలల విద్యార్థులకు బంద్ నుంచి మినహాయింపు నిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులతో జరిగిన సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కే.రాధాకృష్ణ మాట్లాడుతూ, నిర్బంధాలు, అక్రమ అరెస్టులు, అణిచివేతతో ఉద్యమాలను ఆపలేరన్నారు. విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, ఆశ్రమాల్లో హెల్త్ అసిస్టెంట్లు నియమించాలన్నారు. డిగ్రీ, ఇంటర్ ట్యూషన్, ఎగ్జామినేషన్ ఫీజులు ఐటిడిఎ చెల్లించాలన్నారు. ఆశ్రమల్లో అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేసి, పెదబయలు మండల తహసీల్దారి మృతి పై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. పాడేరు ఐటీడీఏ పీవోను బదిలీ చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, మీడియా ప్రతినిధుల అనుమతిని నిరాకరిస్తూ జారీ చేసిన నోటీసులు తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బత్తిరి నరేష్, చిన్నారావు, కుమార్, కంబిడి లతకుమరి, స్వరూప, ముచ్చల లక్ష్మణరావు, చంటి, చిన్ని, రాణి, విమల తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:అరకులో ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. అరకువేలి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు మూతప డ్డాయి.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పి సురేంద్ర, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ఎస్.గంగమ్మ మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల మరణాలపై జ్యుడిషియల్ విచారణ జరిపించి, పాడేరు ఐటీడీఎ పీఓ ను ప్రభుత్వం సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నేతలు ఐటిడిఎ వద్ద శాంతియుతంగా దీక్షలు చేపట్టినా గిరిజన ఎంపీ, ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు.

పీవో దిష్టిబొమ్మను దగ్ధం

ముంచింగిపుట్టు:మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎస్ఎఫ్ఐ, గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఐటీడీఏ పిఓ దిష్టిబొమ్మను నాలుగు రోడ్ల కూడలి లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె నరసయ్య, మండల కార్యదర్శి ఎంఎం శ్రీనులు ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లోని విద్యార్థులతో మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు గాసిరం, మండల వైస్ ఎంపిపి1 సత్యనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి పి భీమరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డోంబ్రు పాల్గొన్నారు.


పాడేరులో డిగ్రీ కాలేజిలో మాట్లాడుతున్న నాయకులు


పెదబయలులో వినతిపత్రం ఇస్తున్న సన్నిబాబు, పృధ్విరాజ్

ర్యాలీ, మానవహారం,

పెదబయలు: మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయ వంతమైంది. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పృధ్వీరాజ్ మాట్లాడుతూ, ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు తరచూ మృత్యువాత పడుతున్నా, అధికారులు ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు.విద్యార్థులు చర్మ వ్యాధులతో బాధ పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు.అనంతరం పెదబయలు కార్యాలయంలో విఆర్ఓకు వినతపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బోండా సన్నిబాబు, మహిళా సంఘం అధ్యక్షురాలు తల్లబు కౌసల్య, గిరిజన సంఘం కమిటీ సభ్యులు జంపరంగి సునీల్‌బాబు, కిల్లో శరబన్న, తదితరులు పాల్గొన్నారు.

బంద్ పాటించిన విద్యార్థులు

డుంబ్రిగూడ:ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘంతో పాటు పలు గిరిజన సంఘాలు పిలుపునిచ్చిన విద్యా సంస్థల బంద్ మండలంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని చిన్నలబుడు పంచాయతీ హట్టగుడ గ్రామంలో బెంగళూరుకు చెందిన ఎఫ్‌విటీఆర్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో బుదవారం ఉచిత కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించారు. హటగూడ గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ జిన్ను ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఇటువంటి అవకాశాలు కల్పిస్తున్న ఎఫ్‌విటీఆర్ఎస్ సంస్థకు అభినందనలు తెలియజేసారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ దీసరి బుద్దరాజు మాట్లాడుతూ, మూడు నెలలు ఉచిత కంప్యూటర్ శిక్షణ నిర్వహించి సంస్థ ఆధ్వర్యంలో సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ ప్రెసిడెంట్ డి. అప్పారావు, ఒకేషనల్ టీచర్ భగత్ , తది తరులు పాల్గొ న్నారు.


ప్రారంభిస్తున్న మాజీ వార్డు మెంబర్



నినాదాలు చేస్తున్న ప్రభావతి, మహిళా నేతలు

మాతా శిశు మరణాలను అరికట్టాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:ఏజెన్సీలో మాతా శిశు మరణాలను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి ప్రభావతి, అల్లూరి జిల్లా అధ్యక్షురాలు వి.వి.జయ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని, మహిళల చట్టాలు, హక్కులను కాల రాస్తున్నారని విమర్శించారు.ఈ మధ్యకాలంలో పలువురు ప్రముఖులు మహిళలను కించపరిచే విధంగా మాటలు మాట్లాడారని మండిపడ్డారు. మాతా శిశు మరణాలు అమాంతంగా పెరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. మహిళలకు ఉపాధి కల్పించి, మహిళల మనోభావాలను కాపాడాలని కోరారు. ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు సీసా విజయలక్ష్మి, మహిళా సంఘం సభ్యురాలు సోనియా ఈశ్వరి, మీనా, దసుధ, ధన, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్మన్ క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరుటౌన్:జడ్‌పి చైర్మన్ క్యాంపు కార్యాలయం బుధవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని జడ్‌పి అతిథి గృహంలో జడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జీసిసి చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యాలయ నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి రూ.10 లక్షల ఖర్చుతో పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి మెడికల్ కౌన్సిల్ నెంబర్ టి.నర్సింగరావు, జెడ్‌పి సిఇఒ శ్రీరామమూర్తి, ఎంపిపి సొనారి రత్నకుమారి, వైస్ ఎంపిపి కనకాలమ్మ, హుకుంపేట జెడ్పిటిసి రేగం మత్స్యలింగం, ఎఎంసి చైర్మన్ సూరిబాబు, ఎఎంసి డైరెక్టర్ గబ్బాడ రాజారావు, సర్పంచులు పార్వతమ్మ, సీతమ్మ, నీలకంఠం, రాంబాబు, బసవన్నదొర, బొంజుబాబు, ఎంపిటిసిలు రామకష్ణ పాత్రుడు, చిట్టెమ్మ, వైసిపి నాయకులు సీదరి రాంబాబు, జల్లిపల్లి మూర్తి, అరబీరు జగబంధు, మినుముల కన్నాపాత్రుడు, సత్యనారాయణ, దశమూర్తి, రామారావు, బాబురావు, సత్యవతి, ఊర్వశీరాణి తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కాఫీ రైతులకు న్యాయం చేయకుంటే ఉద్యమం

గాలికొండ ఎంపిటిసి సభ్యులు బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు

కాఫీ రైతులకు న్యాయం చేయకుంటే ఉద్యమం చేపడతామని జికె.వీధి మండలం, గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు హెచ్చరించారు. బుధవారం గాలికొండ పంచాయితీ చిలకల వీధి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా 11 మండలాల్లో 47 వేల మంది కాఫీ రైతులకు 2018 నుంచి 2021 వరకు చెల్లించవలసిన రూ.60 కోట్లు వారి అకౌంట్లో తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన రైతులు పట్ల ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి పిఓ రోణంకి గోపాలకృష్ణ చిన్నచూపు చూసి వారికి రావలసిన నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 9న జీకే వీధిలో కాఫీ రైతులతో సదస్సును ఏర్పాటు చేశామని, రైతులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గేమిల రఘునాథ్, రైతులు హిర్మయ్య, మార్య రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిటిసి సభ్యులు బుజ్జిబాబు

సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు

మారుమూల గ్రామాల్లో యువత అభివృద్ధి చెందాలంటే సంఘ విద్రోహశక్తులకు దూరంగా ఉండాలని సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ కమాండెంట్ సతీష్ కుమార్ గిరిజనులకు పిలుపునిచ్చారు. మావోయిస్టు కంచుకోటగా ఉన్న జీకే వీధి మండలం, దుప్పిలివాడ పంచాయతీ గొర్రె లోవలో బుధవారం సీలేరు సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో సతీష్‌కుమార్, జికె.వీధి సిఐ అశోక్‌కుమార్ పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా బంధ వీధి, కొమ్ములవాడ, గుండేరు బయలు, పులి గుప్ప గ్రామ గిరిజనులకు 190 రగ్గులు, 24 వాటర్ డ్రమ్ములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెగా వైద్య శిబిరాన్ని పోలీసులు వైద్య అధికారి సౌమ్య నిర్వహించారు. 300 మంది గిరిజనులు పాల్గొనగా 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ గిరిజన యువత బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు అవరోధించాలని సూచించారు. సిఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొర్రెలోవ, బంధ వీధి, కొమ్ములవాడ, పులి గుప్ప, గుండేరు బైలు గ్రామాలకు చెందిన 300 మంది గిరిజనులకు పోలీసులు భోజనాలు ఏర్పాటు చేశారు.


గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న పోలీసులు


మృతురాలి భర్తను ఓదార్చుతున్న గిరిజన సంఘం నేత

మాత శిశు మరణాల అరికట్టాలి

గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి మారేడుమిల్లి

వై.రామవరం మండలం, దదలికవాడ గ్రామంలో రక్త స్రావంతో ఓ గర్భిణి చనిపోయిన సంఘటన చాలా విచారకరమని, ఏజెన్సీలో మాతా శిశు మరణాలు అరికట్టాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు సాదల విద్యాసాగర్ రెడ్డి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ జర్త కృష్ణ రెడ్డి, మాజీ సర్పంచ్ పల్లాల అబ్బాయి రెడ్డి, పల్లాల పెద అబ్బాయి రెడ్డి, ఎంపిటిసి కెచ్చేలా శ్రీను బాబు, కెచ్చేలా అచ్చిరాజు, జర్త విజయకుమార్ తదితరులు గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ విపరీతంగా రక్తస్రావంతో చనిపోయినా కుమారి కుటుంబాన్ని, ముగ్గురు చిన్న పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సకాలంలో గిరిజనులకు వైద్యం అందడం లేదని, ప్రభుత్వం, ఐటిడిఎ, వైద్యాధికారులు సరిగ్గా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏజెన్సీలో మరణాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. దదిలిక వాడ గ్రామానికి రోడ్డు సౌకర్యం, మంచినీరు సరిగ్గా లేవని తెలిపారు. అధికారులు వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే గ్రామస్తులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

ఉపాధ్యాయ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి

పాఠశాలను సందర్శించిన ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రభుత్వ, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని ముద్దులగూడెం, సీతంపేట, శ్రీరామగిరి, చొక్కానపల్లి, చొక్కన పల్లి గొమ్ము పాఠశాలలను బుధవారం వారు సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా ఎంపీపీ కారం లక్ష్మి అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీశారు. శ్రీరామగిరి మండల పరిషత్ పాఠశాలలో ఒకటి నుంచి 8 వరకు తరగతి వరకు 70 మంది పిల్లలు ఉండగా, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని, చొక్కాపల్లి స్కూల్లో 30 మందికి ఒక ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. పాఠశాలలో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, మౌలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్యనారాయణ, గొంది ధారయ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జలపాతాన్ని పున:ప్రారంభిస్తున్న ఎస్ఐ సత్తిబాబు, ఎంపిటిసి నాగేశ్వరరావు

పొల్లూరు జలపాతం సందర్శనకు అనుమతి

ప్రజాశక్తి- మోతుగూడెం

చింతూరు డివిజన్ పరిధిలోని మోతుగూడెం పంచాయతీ పొల్లూరు జలపాతం సందర్శనకు అనుమతి ఇచ్చినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ జలపాతం అభివృద్ధికి డిఎఫ్ఒ వాకపల్లి సాయిబాబా ఆదేశాల మేరకు ఐదు రోజులుగా పర్యాటలకు అనుమతి నిరాకరించిన సంగతి తెలిసిందే. బుధవారం నుండి జలపాతం వద్దకు పర్యాటకులను అనుమతి ఇచ్చారు. ఐదుగురు వన సంరక్షణ సమితి సిబ్బందిని నియమించారు. జలపాతం వద్ద చుట్టూ పరిసరాలలో ఎటువంటి చెత్తా చెదారం లేకుండా సిబ్బందితో శుభ్రం చేయించనున్నారు. జలపాతానికి 50 మీటర్లు ఇవతల ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను బుధవారం మోతుగూడెం ఎస్ఐ వాసంశెట్టి సత్తిబాబు, ఎంపిటీసి వేగి నాగేశ్వరరావు ప్రారంభించారు. పర్యాటకుల వద్ద కొంత రుసుము వసూలు చేసి సిబ్బందికి జీతాలు, మిగిలిన ఆదాయంతో పర్యాటకులకు ముఖ్యంగా స్త్రీలకు దుస్తులు మార్చుకోవడానికి వెదురుతో రెండు, మూడు గదులు, పర్యాటకులకు భోజనాలు చేయడానికి అనువుగా తగు ఏర్పాట్లు చేపడతామని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కవరం ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్ఓ కొండలరావు, డిఆర్ఓ సత్యనారాయణ రాజు, ఎఫ్‌బిఓ వెంకట్, అటవీ అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి- కొయ్యూరు

నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్ సూచించారు. బుధవారం ఆయన కొయ్యూరు మండలంలోని మారుమూల కిత్తాబు గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. నాడు-నేడు పనులను పరిశీలించారు. నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కొయ్యూరు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చిట్టింపాడు పంచాయితీ పరిధి బి.కొత్తూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం ఎమ్మెల్యే చేపట్టారు. ఈ గ్రామంలో మొత్తం 54 గడపలను ఆమె సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించి అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, ఏఎంసీ చైర్ పర్సన్ జైతి రాజులమ్మ, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, స్థానిక ఎంపీటీసీ బిడిజన అప్పారావు, వైసిపి నాయకులు జల్లి బాబులు, గాడి నాగమణి, సుమర్ల సూరిబాబు, బండి సుధాకర్, ముసిలి నాయుడు, సర్పంచ్‌లు పొట్టిక భవాని, వెంకటలక్ష్మి, జంపా రాజకుమారి, ఎంపీడీఓ మేరీరోజ్ పాల్గొన్నారు.


గ్రామస్తులకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గిరిజనేతరుల గృహాలు స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద, నాలుగు రోడ్ల కూడలిలో గిరిజనేతరులు గృహాలు నిర్మించుకొని జీవనోపాధి గడుపుతూ స్వగ్రామాలకు వెళ్ల పోయారని, వాటిని స్వాధీనం చేసుకోవాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం అఖిలపక్ష, గిరిజన ప్రజాసంఘాల నేతలు తహశీల్దార్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం ఎం శ్రీను మాట్లాడుతూ, గిరిజనేతరులైన సకల భక్తుల సూర్యారావు, (శెట్టి), చెల్లూరి డిల్లేశ్వరరావులు విడిచిపెట్టి వెళ్లిన గృహాలన్ని ప్రభుత్వపరంగా స్వాధీన పరచుకోవాలన్నారు. లేనిపక్షంలో గిరిజన ప్రజా సఘాలతో ఈనెల 16న గిరిజ నేతలు విడిచిపెట్టి వెళ్లిన గృహాలను స్వాధీన పరుచుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పాటుభోయి సత్యనారాయణ, పాంగి భీమరాజు, సోలగం గాసిరాందొర, నరసయ్య, విశ్వనాథం పడాల్, మండల వర్తకుల సంఘం అధ్యక్షుడు సోనియా ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:-మండలంలో వనగుమ్మ పంచాయతీ వనగుమ్మ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త ఎం.సూరమ్మ ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. సచివాలయ మహిళల పోలీస్ ఎం.సౌందర్య మాట్లాడుతూ, గర్భిణులు పోషకాతో కూడిన ఆహారంతో పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. సకాలంలో ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గర్భిణీలు అశ్రద్ధ వహించకుండా ప్రసవానికి ముందుగా ఆసుపత్రుల్లో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద శంకర్‌రావు, ఆశా వర్కర్ ఎం సువర్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

సకాలంలో వైద్యం అందించండి

డిఎం అండ్ హెచ్ఒ జమాల్ భాష

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గర్భిణీలకు, శిశువులకు సకాలంలో వైద్యం, వ్యాక్సినేషన్ చేయాలని డిఎం అండ్ హెచ్ఒ సి.జమాల్ భాషా సూచించారు. పాడేరు మండలం ఈదులపాలెం పిహెచ్‌సి పరిధిలోని వంట్లమామిడి వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. విల్లేజ్ హెల్త్ క్లినిక్‌లో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలింతలకు, శిశువులకు అందిస్తున్న పౌష్టికాహారం, వైద్య సేవలపై అంగన్వాడీ, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలను బర్త్ వెయిటింగ్ హెూమ్‌లలో చేర్పించి, ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖప్రసవాలకు చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, పాలు పట్టే విధానం, వ్యాక్సినేషన్ పై అవగాహన కల్పించారు. మాతృశిశు మరణాల నివారణకై వైద్య ఆరోగ్య శాఖ, అంగన్వాడిల ద్వార తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫీడర్ అంబులెన్సు ను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మలకపోలం జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు జరిపిన ఆరోగ్య పరీక్షలపై ఆరాతీశారు. కిచెన్ గదిని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా టిబి పర్యవేక్షకులు వి.కిరణ్ ఉన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కాకుండా ఏర్పాట్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడదామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు గొండు సీతారాం పేర్కొన్నారు. ఎంవిపి కాలనీలోని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో విశాఖ జిల్లాకు చెందిన స్త్రీ శిశు, సంక్షేమ శాఖ, ఎక్సైజ్, విద్యా, సాంఘిక సంక్షేమ, పోలీసు, వైద్య, ఆరోగ్య శాఖ, డ్రగ్ కంట్రోల్ అథారిటీ, జిల్లా పరిషత్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువైనల్ జస్టిస్ బోర్డ్, జిల్లా బాలల సంరక్షణ విభాగం, సీడ్ ఎన్జీఓ సంస్థల ప్రతినిధులతో ప్రివెన్షన్ ఆఫ్ డ్రగ్స్, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, నివారణపై జాయింట్ యాక్షన్ ప్లాన్ రూపొందించడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

నాడు నేడు పనులు వేగవంతం చేయండి

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ



వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు మన బడి నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ సూచించారు. తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. 11 మండలాల ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, ఎటిడబ్ల్యూఒలు, ఎంఇఒలు, సిడిపిఒలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, గృహ నిర్మాణ శాఖల, ఉపాధి హామీ అధికారులతో బుధవారం ఐటిడిఎ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి పథకాల పనులు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలో జరుగుతున్న మన బడి నాడు-నేడు పనులు, ఉపాధి హామీ పనులు, గృహ నిర్మాణాలు, జగనన్న స్వచ్ఛ సంకల్పం పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడు నెలలో తాగునీటి సమస్యలు లేకుండా తగిన విధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ భవన నిర్మాణాలు, జూనియర్ కళాశాలలు, పాఠశాలలు ఆధునీకరణకు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాడేరు డివిజన్ పరిధిలో ఉపాధి పనులు పెద్ద ఎత్తున కల్పించాలన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతీ గిరిజన కుటుంబానికి వంద రోజులు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. సిడిపిఒ, ఎంఇఒలు, ఇంజనీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి పనుల్లో పురోగతి సాధించాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు లబ్దిదారులకు పూర్తి సహాయ సహకారాలు అందించి నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. చింతపల్లి, సీలేరు రోడ్డు, కంద్రూం, జామిగుడ రోడ్ల పురోగతి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారుల మధ్యలో ఉన్న కల్వర్టుల పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిపిఒ పి.ఎస్ కుమార్, టిడబ్ల్యూ ఇఇ డివిఆర్ఎం రాజు, ఆర్ డబ్ల్యూఎస్ ఇఇ లీలాకృష్ణ, పిఆర్ పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, ఆర్అండ్‌బి ఇఇ బాలసుందర బాబు, హౌసింగ్ పిడి, బిహెచ్.శ్రీనివాస్, డిఇ బాబు, ఉపాధి హామీ ఎపిడి జె.గిరిబాబు, ఎటిడబ్ల్యూఒ ఎల్.రజని పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న లీలా ప్రసాద్

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి : ఎడిఎంహెచ్ఒ

ప్రజాశక్తిపాడేరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ప్రజలు వినియోగించుకోవాలని, ఎడిఎంహెచ్ఒ లీలాప్రసాద్ సూచించారు. బుధవారం పాడేరు మండలం మినుములూరు పిహెచ్‌సి పరిధిలోని తుంపాడ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ ను సందర్శించారు. క్లినిక్‌లో గర్భిణీలకు, శిశువులకు జరుపుతున్న వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. బాలింతలకు, శిశువులకు అందిస్తున్న పౌష్టికాహారం, వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంతాడపల్లి గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాం వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాం శిభిరాలలో విధుల్లో ఉండాల్సిన వైద్యాధికారులు, సిబ్బంది విధిగా హాజరై రోగులకు సేవలందించాలని, ముందస్తు సమాచారం లేకుండా సెలవులను పెట్టరాదని హెచ్చరించారు. ఆ పరిధి ప్రోగ్రాం అధికారి ద్వారా జిల్లా అధికారి సెలవును గ్రాంట్ చేస్తేనే సెలవులను వినియోగించుకోవాలని తెలిపారు. లెప్రసీ వ్యాధి పట్ల ప్రజలకు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కలిపించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది మరియు ఆశా కార్యాకర్తలు పర్యటించినప్పుడు అనుమానిత లెప్రసీ రోగులను గుర్తించి సమీప ఆరోగ్య కేంద్రాలకు తరలించి వైద్య పరిక్షలు చేయించాలన్నారు. తాగునీటి, అంటువ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మినుములూరు పిహెచ్‌సి సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యాక్రమంలో జిల్లా క్షయ, ఎయిడ్స్, లెప్రసీ అధికారి టి. విశ్వేశ్వరరావునాయుడు, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి సింహాద్రి, సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గున్నారు.

కార్మిక శాఖ కార్యాలయం ఏర్పాటుచేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బాలదేవ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అల్లూరి జిల్లాలో కార్మిక శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్ డిమాండ్ చేశారు. బుదవారం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు రామచందర్ అధ్యక్షతన శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో కార్మిక శాఖ కార్యాలయం ఏర్పాటు చేసి భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరణ చేసి నిధులు సమకూర్చాలని, పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ సెటిల్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ భీమాతో సంబంధం లేకుండా భవన నిర్మాణ కార్మికులకు భీమా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. పెరుగుతున్న సిమెంటు, స్టీలు, ఇతర సామగ్రి ధరలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి సత్తిబాబు, నాయకులు సోమినాయుడు, సింహాచలం, రాంబాబు, వెంకటరావు, శ్రవణ్ కుమార్, అప్పలనాయుడు, రామారావు, హరి, మల్లేష్, అప్పలనర్శయ్య, అప్పలనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలదేవ్



పిల్లలను పరీక్షిస్తున్న వైద్యురాలు

45మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గాసభా పంచాయతీ కూడ మారుమూల గ్రామంలో బుధవారం స్థానిక వైద్యాధికారిని కె.కరుణ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందించారు.ఆ గ్రామంలోని ఇంటింటికి తిరిగి వైద్యాధికారిని చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి, వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'చాపరాయి నిర్వహణను అప్పగించాలి'



మాట్లాడుతున్న సర్పంచ్

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం నిర్వహణను స్థానిక పోతంగి పంచాయతీకి అప్పగించాలని సర్పంచ్ వి వెంకట్రావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, చాపరాయి జలపాతం అభివృద్ధికి మొదటిసారిగా పంచాయతీ ద్వారానే టెండర్ పాటను ప్రారంభించారని చెప్పారు. పాట ద్వారా వచ్చిన నిధులతో అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. గత ఏడాది పాడిన టెండర్ పాట గడువు జనవరితో ముగిసినప్పటికీ కొత్త టెండర్ పాట నిర్వహణను అధికారులు చర్యలు చేపట్ట లేదన్నారు. దీంతో, టెండర్ గడువు ముగిసినప్పటికీ పాత టెండర్ దారులే మళ్లీ యధావిధిగా ప్రవేశ రుసుం పార్కింగ్ రుసుములను వసూలు చేసుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే కొత్త టెండర్ పాట నిర్వహించాలని, లేనిపక్షంలో పంచాయతీకి, స్థానిక రిజిస్ట్రేషన్ కలిగిన సొసైటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎం శ్రీరాములు, టిడిపి సీనియర్ నాయకుడు కే.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం పోరాటంతో ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-విఆర్.పురం

సిపిఎం పోరాట ఫలితంగా మండలంలోని రేఖపల్లి, పెద్దమాటపల్లి, కుందులూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు తెలిపారు. ఈ మూడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసి వేయడంతో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకో చేయడంతో దిగొచ్చిన అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటి వల్ల మండల పరిధిలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, కేంద్రాలు ప్రారంభం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజినీ, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, శ్రీరామ్మూర్తి, రైతు సంఘ నాయకులు వడ్లది రమేష్ కుంజ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

20 కుటుంబాలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - మోతుగూడెం

మోతుగూడెం మేజర్ పంచాయతీ పరిధిలోని మల్లవరం, పొల్లూరు గ్రామాలలో ఎపిజెన్కో ఎస్ఇ వెంకటేశ్వరరావు దంపతులు మల్లవరం గ్రామంలోని 20 నిరుపేద కుటుంబాలకు పొల్లూరు గ్రామంలోని వికలాం 1గులకు దుస్తులు, దుప్పట్లు, టవల్‌లు బుధవారం పంపిణీ చేశారు. ఉచితంగా వస్త్రాలు పంపిణీ చేసిన వెంకటేశ్వరరావు దంపతులకు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సాయిబాబా మందిర సేవకులు విశ్వనాధం, పేపకాయల శ్రీను, మల్లవరం, పొల్లూరు గ్రామస్తులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్ఇ దంపతులు

24న విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలు



ఎన్నికల అధికారికి నియామక పత్రం ఇస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : విశాఖపట్నం జిల్లా న్యాయవాదుల సంఘానికి ఎన్నికలు ఈనెల 24న జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది, న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షులు జి మహేశ్వర్‌రెడ్డిని నియమిస్తూ ప్రస్తుత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైద్యులు రవీంద్రబాబు వేణుగోపాలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వెంటనే ఎన్నికల అధికారిగా షెడ్యూల్‌ను ప్రకటించారు.

ఈ నెల పదో తేదీలోపు సభ్యులందరూ సభ్యత్వాలను చెల్లించాలని, వెంటనే ఓటర్ల జాబితాను వెల్లడిస్తా మన్నారు. తర్వాత ఈనెల 10 నుండి 16 వరకు నామినేషన్లు స్వీకరణ, 21న నామినేషన్ల పరిశీలన, 22న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీ అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తారు. ఈనెల 24న ఉదయం 10 గంటల నుండి సాయంకాలం నాలుగున్నర గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అనంతరం ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఎన్నికల్లో విశాఖ న్యాయవాదుల సంఘానికి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు ఉపాధ్యక్షుడు, జాయింట్ సెక్రటరీ, లైబ్రరీ, సాంస్కృతిక సెక్రటరీ పదవులను అభ్యర్థులను ఎన్నుకోనున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేసే వరకు

కేంద్ర ప్రభుత్వంపై పోరాడుదాం

నిర్వాసితుల రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి

అంతవరకు పోలవరం ప్రాజెక్టు పనులు నిలుపుదల చేయాలని సూచన



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి ఐవి

ప్రజాశక్తి-ఎటపాక : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఏ ప్రభుత్వం వచ్చినా న్యాయం జరగటం లేదని, ఇది జాతీయ హోదా కలిగిన ప్రాజెక్టు కనుక కేంద్ర ప్రభుత్వం నిర్వాసిత ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేసే వరకు ప్రాజెక్టు పనులు ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గన్నవరం గ్రామంలో జరిగిన నిర్వాసితుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు పోలవరం నిర్వాసితులకు జగన్మోహన్ రెడ్డి చేసిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని, లేకపోతే నిర్వాసితుల ఆగ్రహానికి గురి కావలసి వస్తుందని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు వద్ద కట్టిన కాపర్ డ్యాం వలన ఈ కాలంలో వచ్చిన వరదలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ముంపునకు గురై ప్రజలు అనేక బాధలు అనుభవించారని తెలిపారు. ఈ బాధలు పునరావృతం కాకుండా ఉండాలంటే అందరం ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు డి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సారధులు పారాలీగల్ వాలంటీర్లు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా అవసరమైన వారికి ఉచిత న్యాయాన్ని అందించే సారధులే పారా లీగల్ వాలంటీర్లని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి అన్నారు. బుధవారం జిల్లా న్యాయసేవ ప్రాధకార సంస్థలోని న్యాయ సేవా సదన్‌లో పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వళనతో ప్రారంభించారు.

కార్యక్రమంలో రాజ్యాంగం, మౌలిక స్వరూప విధివిధానాలపై సీనియర్ న్యాయవాది కుప్పిలి మురళీధర్ అవగాహన కల్పించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన నల్సా పథకాలపై మరో న్యాయవాది ఆర్ శ్రీనివాసరావు వివరించారు.. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విధివిధానాలు, అందిస్తున్న సేవలపై సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బులికృష్ణ వివరించారు.



జ్యొతిప్రజ్వలనతో శిక్షణను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి గోపి

వరల్డ్ సిలంబం ఓపెన్ ఛాంపియన్ షిప్‌లో..

శ్రావణ్ కుమార్‌కు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సింగపూర్‌లో వరల్డ్ సిలంబం మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జనవరిలో నిర్వహించిన వరల్డ్ సిలంబం ఓపెన్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించినట్లు క్రీడాకారుడు కూనిరెడ్డి శ్రావణ్ కుమార్ తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగిల్ స్టిక్ రొటేషన్ కేటగిరీలో తనకు ఈ బహుమతి వచ్చిందన్నారు. ఇదివరకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు పోటీలలో కూడా విజయం సాధించానని తెలిపారు. తన కుటుంబ సభ్యుల సహకారంతో ఈ క్రీడలో 10 ఏళ్ల నుంచి శిక్షణ తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ క్రీడ తమిళనాడులో చాలా ఫేమస్ అని పేర్కొన్నారు. ఇది ప్రాచీన క్రీడ అన్నారు. ఈ సమావేశంలో శ్రావణ్ కుమార్ తల్లిదండ్రులు కూనిరెడ్డి మురళి, మానసతో పాటు ఇతర కుటుంబ సభ్యులు ఎం.లక్ష్మి పాల్గొని మాట్లాడారు.

ఆర్థోపెడిక్ సదస్సుకు అపోలో వైద్యుని కథనాలు

పజాశక్తి - ఆరిలోవ : వియన్నా, ఆస్ట్రియాలో జరగనున్న ప్రతిష్టాత్మక యూరోపియన్ ఫెడరేషన్ నేషనల్ ఆర్థోపెడిక్ అసోసియేషన్స్ ఇన్ ఆర్థోపెడిక్స్ అండ్ ట్రమటాలజీ (ఇఎఫ్ఒఆర్‌టి) వార్షిక సదస్సుకు అపోలో ఆసుపత్రి ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ విజయవంతంగా నిర్వహించిన రెండు అరుదైన శస్త్రచికిత్స కథనాలు ఎంపికయ్యాయి. ఈ మేరకు ఇఎఫ్ఒఆర్‌టి సైంటిఫిక్ కమిటీ ఒక లేఖను పంపించింది. డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ తాలస్ ఆంధ్ర రాష్ట్రంలోనే మొదటిసారిగా ఆస్టియోకాండ్రల్ గాయం కోసం చీలమండ ఆర్థోస్కోపి, ఎటిఎఫ్ఎల్ పునర్నిర్మాణం ఆర్థోస్కోపి చికిత్సలు విజయవంతంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ రెండు చికిత్సలకు సంబందించిన శాస్త్రీయ కథనాలు ఎఫోర్ట్‌కు ఎంపిక కావడంపై అపోలో ఆసుపత్రికి దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు ఆసుపత్రి యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది.

ప్రభుత్వ పథకాలు అందాలంటే డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా చేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం శ్రీనివాస్

ప్రజాశక్తి-కొయ్యూరు

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు కావాలంటే డ్వాక్రా సంఘాల్లో సభ్యులు కావాలని వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు సూచించారు. బూదరాళ్ల పంచాయతీ కునుకూరు గ్రామంలో గిరి మహిళలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. సుమారు 40 మందితో నూతనంగా మూడు సంఘాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలకు అర్హులు కావాలంటే డ్వాక్రా సంఘ సభ్యులుగా నమోదు కావాలన్నారు. సభ్యులకు సున్నా వడ్డీపై రుణాలు అందించనున్నట్లు చెప్పారు.

కుష్టు వ్యాధిపై నిర్మూలనపై అవగాహన



అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుమ్మిరేవులు సచివాలయంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ జాతీయ కుష్టి వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈనెల 13 వరకు కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కుష్టు వ్యాధి రహిత దేశంగా తీర్చిదిద్దవలసిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. స్పర్శ లేని మచ్చలు, నూనె పూసినట్టుగా నిగనిగలాడే స్పర్శ లేని మచ్చలు, చర్మం రంగు కంటే కొంత తక్కువ రంగు లేదా రాగి రంగు ఉన్న స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే ప్రాథమికంగా కుష్టు వ్యాధి ఉన్నట్లు నిర్ధారించుకోవచ్చునని వెల్లడించారు. గిరిజనులు మూఢనమ్మకాలతో బలి కావద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఒ పోతురాజు, హెల్త్ అసిస్టెంట్ గోవిందు అప్పారావు, పిహెచ్ఎన్ రాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని యు.చీడిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆ గ్రామంలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జయ ప్రకాష్ మాట్లాడుతూ ఎవరికైనా కుష్టు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పీహెచ్సీని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఈవో గంగరాజు, ఫార్మాసిస్ట్ సురేంద్ర, ఈఎంటీ విజయ్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.